# ఏమి అదృష్టం!

"జమీందారుగారి భార్య నిన్ను చూడాలన్నది. మధ్యాహ్నం వెళదామా ఒకస్సారి" అన్నాడు సంజీవరావు, ఇంటికి రాగానే. 'నన్నా? ఎందుకూ?' అన్నది విమల - వంచిన తల ఎత్తకుండా, పిల్లవాడికి పాలు కలుపుతూ....

సంజీవరావు, తిరిగి తిరిగి, ఎక్కడా వుద్యోగం దొరకదని నిస్పృహచేసుకొన్న వారంరోజులకు, జమీందారుగారబ్బాయికొక ట్యూటరు కావాలని తెలియవచ్చింది. ఆశతో జమీందారుదర్శనం చేసుకున్నాడు. కోరిక ఫలించింది. చిన్నదొర కూడాకూడా తిరగటం, అతనికి బుద్ధిపుట్టినప్పుడు రెండు ముక్కలు చెప్పటంకంటె వేరే పని ఏమీ లేదు. జీతానికి లోపంలేదు. ప్రాణంకుదుటబడ్డది. రాణీ అప్పుడప్పుడు సంజీవరావుకు కబురుచేసి పిల్లవాడి యోగక్షేమాలు కనుక్కునేది. అల్లాగే సంజీవరావు కష్టసుఖాలుకూడా విచారించేది. క్రమేణా సంజీవరావుకు ఆమెయందు చాలా గౌరవం ఏర్పడ్డది. విమల రాణీగారిని చూడటానికి ఉత్సాహపడటం బదులు అడ్డు ప్రశ్నలువెయ్యటం చూసి సంజీవరావుకు చిరాకువేసింది.

'ఎందుకేమిటే, నీ మొహం! ఆవిడ అంతగా నిన్ను చూడాలని అంటూవుంటే నువ్వు—' అన్నాడు విసుగుతో.

'అదికాదండీ, నాకు మంచిచీర వక్కటి అయినా లేదుగదా, ఎల్లాగ అనీ.'

విమలకు ఎక్కడికైనా వెళ్లాలన్నప్పుడల్లా తనకు మంచి చీరెలు లేవని జ్ఞాపకంవస్తూ వుంటుంది. అందుకనే సంజీవ రావు ఆమెను ఎక్కడికీ తీసుకుపోనేపోడు.

'నీ పెళ్ళినాటి పట్టుచీరె వున్నదిగదా, అది చాల్లేద్దూ' అన్నాడు సముదాయిస్తూ.

'అదేమి చీరండీ! అంతా వెలసిపోయింది! కొంచెం చినిగిందికూడాను' అన్నది, మూరాముపెడుతూ.

'ఫరవాలేదులే. ఏచీర కట్టుకున్నా ఆవిడకంటె అందం గానే వుంటావు.' అన్నాడు సంజీవరావు కొంటెగానవ్వుతూ.

విమలముఖము కలువపువ్వులాగ వికసించింది. ఆమె కళ్ళల్లో సంతోషం ఉక్కిరిబిక్కిరయింది. కాని మరుక్షణమే విచారరేఖలు ముందుకు తోసుకువచ్చాయి. 'ఏమోలెండి, ఎల్లా వుంటేనేం, ఆవిడ అదృష్టం నా కెల్లావస్తుంది'' అంది.

''సరేలే, మూడుగంటలకు నువ్వూ పిల్లలూ సిద్ధంగా వుండండి. నేను వచ్చి తీసుకుపోతాను'' అన్నాడు, అతను, మళ్ళీ కండువా పైనవేసుకుంటూ.

* * *

విమల పన్నెండింటికే మొదలుపెట్టింది ప్రయాణ సన్నాహం. అయినా, పిల్లలకు తలదువ్వి నీళ్ళుపోసి తనూ సింగారించుకునేప్పటికి మూడు కావచ్చింది. విమలకు విసుగూ విచారం ముంచుకువచ్చాయి ''ఏమిజీవితం! ప్రొద్దున లేచింది మొదలు రాత్రి పదిగంటలదాకా క్షణం తీరికలేదు. ఎక్కడికి వెళ్ళాలన్నా విశ్వప్రయత్నం కావాలి. జీవితంలో

విశ్రాంతి శాంతి. రెండూ లేవు. అన్నీ తీరనికోరికలే. ఇప్పుడు జమీందారుగారింటికి వెళ్లకపోతేనేం? తను ఆమెకంటె అందంగా వుంటుందట. — అయితేమాత్రం ఆమెకూ తనకూ సామ్యం ఏమిటి? ఆమె లక్ష్మీప్రసన్నురాలు, తను వెలిసిన చీరె, తనూ—బండిఆగిన చప్పుడు విని తలుపు తీసింది.

"రెడీగా ఉన్నారా? పోదామా?"

"ఊ చూడండి: ఆవిడకు చాలా గర్వమా?"

"ఛీ!, చాలా మంచి మనిషి."

తల వాల్చుకొని బండి ఎక్కింది విమల. పిల్లలిద్దరూ బండిచూసి మురిసిపోయ్యారు.

*　　　*　　　*

జమీందారిణిగారి పేరు గుణవతీ దేవి. ఆమే, జమీందారుగారూ ఒకరినొకరు చూసుకొని కొన్ని సంవత్సరాలవుతుంది. గుణవతి ఇప్పుడు కేవలం విలువైన వస్తువులు కొనడంతోనే హృదయాన్ని తృప్తిపరచుకోవాలని చూస్తున్నది. చీరెలూ, నగలూ సంతోషాన్ని ఇవ్వడం మానేసి చాలా రోజులైనాకూడా అలవాటుచొప్పున ఇంకా కొంటూనే ఉంటుంది. పైగా ఆమెకు అదే వ్యాపకం కూడాను. ఇవ్వాళ కూడా విమల వచ్చేసరికి ఆవిడ చీరల బేరంలోనే ఉన్నది.

'డబుల్ కలర్ చీరెలు ఇప్పుడు చాలామంది కడుతున్నారమ్మా. ఈ చీర చిత్తగించండి' అంటున్నాడు సెట్టి... విమల చీర చినుగు కనపడకుండా కుచ్చెళ్ళు సర్దుకుంటూ రాణీని సమీపించింది.

'రండి, కూర్చోండి' అన్నది సోఫా చూపిస్తూ, గుణవతి. విమల బెదురుతూ కూర్చున్నది, చీరలనుచూస్తూ. ఎంత మంచి చీరెలు! ఎంత చక్కని జరీపని! ఆ చీరెలన్నీ చూస్తూ వుంటే, తన వంటిన వెలిసిపోయిన చీరె ముళ్లు గ్రుచ్చుకుంటు న్నట్లున్నది.

గుణవతికి మాత్రం ఒక్క చీరా నచ్చలేదు. అసలు ఆమెకు కావలసినది చీరెలయితేగదా! 'ఏమీ బాగా లేవు, రేపు ఇంకేమయినా రకాలు పట్టుకురా.' అన్నది సెట్టితో.

'చిత్తం' అంటూ మూట కట్టుకొని వెళ్ళిపోయాడు సెట్టి....దాసీది టీ తెచ్చి పెట్టింది....

'టీ పుచ్చుకొంటారా' అన్నది గుణవతి. విమల గుణవతి కేసి తలెత్తిచూసింది. అందం లేకపోయినా, ఆమె ముఖంలో ఎంత ఠీవి వున్నది! ఏదో చెప్పలేని ఆకర్షణ!... కళ్లల్లో మాత్రం విచారం కనబడుతుంది.

'వద్దండీ, నాకు అలవాటు లేదు' అన్నది వినపడీ వినపడకుండా.

గుణవతి, మాట్లాడకుండా, రెండు కప్పులలో టీ పోసి పిల్లలిద్దరికీ ఇచ్చింది. చిన్నవాడు వేడి పట్టుకోలేక టీ అంతా కాశ్మీర తివాసీమీద కొంతా, తన చొక్కామీద కొంతా వలకబోసుకున్నాడు. ఖరీదయిన తివాసీ మరకైందన్న భయంతో పిల్లవాడిమీద కోపం వచ్చింది విమలకు. 'ఏమి సంతానం' అని మనస్సులో విసుక్కున్నది. గుణవతిమాత్రం, నవ్వుతూ, పిల్లవాడిని దగ్గరకు తీసుకొని పట్టురుమాలుతో

తుడిచి మళ్లీ టీ త్రాగించింది....విమలకు కొంచెం ఊపిరి సలిపింది.

'ఎప్పుడూ ఇంతే! ఎక్కడికెళ్లినా ఏదో వకటి. బయట అడుగుపెట్టడానికే భయం' అన్నది విమల.

'ఫరవాలేదండీ! ఈ మాత్రానికే!!' అంటూ నవ్వింది గుణవతి.

'అది కాదండీ, నాకు వీళ్ళతో విసుగొస్తున్నది. ఒక్క నిమిషమైనా విరామంలేదు. ఎప్పుడూ నా కొంగు పట్టుకొని వదలరు' అన్నది విమల,—సంసారం గొడవల్లోకి దిగుతూ, మామూలు ధోరణిలో.

'మంచిదేగదా, మీకు బాగా కాలక్షేపం అవుతుంది.'

'సరిలేండి, వీళ్లతో ఒక్కపనీ తెమలదు.'

గుణవతి అకారణంగా నవ్వింది. 'అదీ! మీకు తీరికలేనిపని. అందునించి విసుక్కుంటున్నారు. నాకు రోజంతా ఏమీ తోచదండీ!...ఇంక మా బాబు, నే రమ్మని కబురుచేస్తేనేగాని నా దగ్గరకు రాడు. వచ్చినా, పదినిమిషాలుకూడా వుండడు. వాడికి నాదగ్గరకంటె 'ఆయా' దగ్గరే ఎక్కువ చనువు! నేను లేకపోయినా ఏమీ బాధపడడు కాని 'ఆయా' ను విడిచి ఒక్క నిమిషంకూడా వుండలేడు!' అని గట్టిగా నవ్వింది.

ఆ నవ్వులో విషాదం ప్రతిధ్వనించింది.

విమల విస్తుపోయి చూసింది: 'దాసీలూ! దాదులూ! పనిలేక ప్రొద్దుపోదట! ఎంత అదృష్టవంతురాలు!!' అనుకున్నది.

'పంతులుగారు కూడా వచ్చారా' అన్నది గుణవతి—ప్రసంగం మారుస్తూ.

'ఆ! బయట వున్నారు. నేను. వెళ్తాను, చాలా సేపైంది' అంటూ లేచింది విమల.

దాసీది పళ్లూ, తమలపాకులూ తెచ్చి పెట్టింది.

'**తరుచు వస్తూవుండండి**' అన్నది గుణవతి.

'అల్లాగే. కాని, నాకు ఇల్లు కదలడానికే వీలుండ దండీ. పనిఅంతా పూర్తిచేసుకొనేసరికి ఆయన ఇంటికి వస్తారు. ఏవో కబుర్లతోటి గడిచిపోతుంది. నేను లేకపోతే ఆయన కేమీ తోచదు' అన్నది విమల సిగ్గుపడుతూ. గుణవతికి కళ్లు చెమ్మగిల్లినవి.

పిల్లలు పళ్ళకోసం ఎగబడ్డారు. ప్రతిదానికీ వాచిపోవ టమే! విమలహృదయం అవమానంతో, దుఃఖంతో కుంగి పోయింది. కళ్లల్లో నీరు నిండింది.

గేటు దాటుతూ భర్తతో 'ఎంత నిదానమైన మనిషి! ఏ కొరతా లేదుగదా! ఏమి అదృష్టం!!' అన్నది కళ్లు తుడుచుకుంటూ.

'ఎంత అందంగా వున్నది! చిలకాగోరువంకలలాగా వున్నారు. ఏమి అదృష్టం' అనుకున్నది గుణవతి,—కిటికీ లోంచి చూస్తూ...కన్నీటిధార ఆపుకోలేకపోయింది.